క్లుప్తంగా

రెండు బైక్‌ల ఢీ: ముగ్గురికి గాయాలు



ప్రమాద స్థలం వద్ద క్షతగాత్రులు

పిఠాపురం: గొల్లప్రోలు వై జంక్షన్ వద్ద గురువారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురికి గాయాలైనట్టు గొల్లప్రోలు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన వద్దనీడి నాగరాజు తన మోటారు సైకిల్‌పై వస్తుండగా మరో వైపు నుంచి పిఠాపురం మండలం విరవకు చెందిన డేగల సూరిబాబు, గుళ్ల సత్తిపండు తమ మోటారు సైకిల్‌పై వస్తూ ఇరువురు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెంకు పురుగుల బెడద నివారించరూ



సామర్లకోటలో ఇళ్లలోకి వచ్చిన పెంకు పురుగులు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో వారం రోజులుగా పెంకు పురుగుల బెడద ఎక్కువగా ఉందని ఆ ప్రాంత ప్రజలు ఎంపీ వంగా గీతకు విన్నవించారు. వందేభారత్ రైలు ప్రారంభానికి వచ్చిన ఆమెకు ఆ గ్రామ ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ ఎఫ్‌సీఐ గోదాములతో పాటు ఏడీబీ రోడ్డు వేర్‌హౌస్ గోదాములు ఉన్నాయి. వీటిలో బియ్యం నిల్వ చేస్తున్నారు. బియ్యానికి పెంకు పురుగులు పట్టే అవకాశం ఉండటంతో ఆయా డిపోల అధికారులు మందులు వాడుతున్నారు. దాంతో ఆ పురుగులు సమీపం పొంతంలోని ఇళ్లలోకి చేరుతున్నాయి. ఈ పురుగులు కళ్లలోను, భోజనాలలోను, ప్రతి వస్తువులను పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీనిపై సామర్లకోట వచ్చిన ఎంపీ గీతకు ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.


స్వాతంత్య్ర వేడుకలకు దళితులు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

తుని: మణిపూర్‌లో గిరిజనులు, దళితులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు నిరసనగా ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర వేడుకలకు దళితులు దూరంగా ఉంటామని దళిత బహుజన పార్టీ(డీబీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడ వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. తుని-పాయకరావుపేట పరివర్తన కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళిత, క్రిస్టియన్ జాతులకు నేటికీ స్వాతంత్య్రం, స్వేచ్ఛ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా అగ్రకులాల ఆధిపత్యంలో దళితులు బానిసలుగానే బతుకుతున్నారన్నారు. దేశంలో ఇంత దారుణమైన పరిస్థితులున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు దువ్వాడ దావీద్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గారా విజయబాబు, నాయకులు జెక్కల సూరిబాబు, చిరుకూరి అర్జునరావు, మార్తి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నర్శిపేటలో మృతురాలి కుటుంబానికి బీమా మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

తొండంగి: మండలంలోని దానవాయిపేట పంచాయతీ నర్శిపేట గ్రామానికి చెందిన పోలవరపు నాగమణి గత మే నెలలో విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా రూ.5 లక్షలు మంజూరైంది. కాగా గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు మడదా హేమంత్, పంచాయతీ కార్యదర్శి రాజబాబు మృతురాలి కుమారుడు పోలవరపు అర్జున్‌కు బీమా మంజూరు పత్రాలను అందజేశారు. బీమా నగదు రూ.5 లక్షలు అర్జున్ బ్యాంకు ఖాతాలో జమైనట్టు పంచాయతీ కార్యదర్శి రాజబాబు వివరించారు. గ్రామ సచివాలయ కన్వీనర్ రాయుడు బాల నర్సయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదజల్లు సాగు... లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు



కొత్తపల్లి మండలంలో వెదజల్లు సాగుకు సిద్ధం చేసిన పొలం

పిఠాపురం: తొలకరి పలకరించడంతో పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఖరీఫ్ వరిసాగు పనులు ఊపందుకున్నాయి. ఖరీఫ్‌లో వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు గాను రైతాంగం వెదజల్లు సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

15 వేల హెక్టార్లలో వెదజల్లు సాగు

పిఠాపురం నియోజకవర్గంలో 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తుండగా గతంలో సుమారు 8 వేల హెక్టార్లకు పైగా వరి పంటను వెదజల్లే పద్ధతిలో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 15 వేల హెక్టార్ల వరకూ వెదజల్లే పద్ధతిలో సాగు చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సమయాభావం, కూలీల కొరత పెరిగిన కూలి రేట్లు తదితర కారణాల వల్ల కూడా వెదజల్లే పద్ధతే అనుకూలమని రైతులు చెబుతున్నారు. ఇటీవల భారీ వర్షాలు వరదలు కారణంగా పంట సాగులో ఇబ్బందులు తలెత్తగా ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు విత్తనాలను వెదజల్లుతున్నారు. వీలున్నంత తొందరగా నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు సూచించిన నేపథ్యంలో నారు మళ్లు వేసి నాట్లు వేయడం ఆలస్యమవుతుందని రైతులు భావిస్తున్నారు. దీంతో నేలను దమ్ముచేసి విత్తనాలను చల్లుతున్నారు. విత్తనం మొలకెత్తకపోతే తరువాత తీసుకొనే చర్యలుపై రైతాంగం కసరత్తు చేస్తోంది.

అధికారుల సూచనలతో..

పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఇప్పటికే చాలా మంది రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు. వెదజల్లడమే మేలు అని వ్యవసాయాధికారులు సూచిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ విధానానికే మొగ్గు చూపుతున్నారు. వెదజల్లిన చేలలో పక్షులు, క్రిమికీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కలుపు నివారణకు జాగ్రత్తలు పాటించి ప్రకృతి సహకరిస్తే మంచి దిగుబడుల వస్తాయనే ధీమాను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు

వెదజల్లు విధానంలో ముందుగా నారు మళ్లు వేయాల్సిన పనిలేదు. నారుమడి తయారీకి అయ్యే ఖర్చుతో పాటు కూలీలు, దుక్కికి అయ్యే ఖర్చులు మిగులుతాయి. అలాగే ఆకుతీత నాట్లుకు అయ్యే ఖర్చులు సైతం తగ్గుతాయి. సమయాభావం నివారించవచ్చు. నీరు ఎప్పుడు అందుబాటులో ఉంటే అప్పుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేయవచ్చు. కలుపు నివారణకు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలి.

పి.స్వాతి, ఏడీఏ వ్యవసాయ శాఖ, పిఠాపురం

జగనన్న పాలవెల్లువ కేంద్రం ప్రారంభం



కొండెవరంలో పాల వెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కొత్తపల్లి: పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొండెవరంలో ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పాల సేకరణ కేంద్రాలు ప్రారంభిస్తారన్నారు. దళారులు, మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా ఈ కేంద్రం ద్వారా పాలు విక్రయించి మద్దతు ధర పొందవచ్చన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాలవెల్లువ కేంద్రాలను నిర్వహిస్తారన్నారు. రైతులు జగనన్న పాలవెల్లువ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం



అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తోందని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని బంగారమ్మ గుడివీధిలో సుమారు కోటి రూపాయలతో నిర్మించే అర్బన్ హెల్త్ సెంటర్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన డ్రైన్లు, రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం చేశామన్నారు. ఆయన వెంట ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ఏపీపీ పేరిశెట్టి మృత్యుంజయరావు, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ముమ్మన ప్రకాష్, డిఈ ఆదినారాయణరావు తదితరులున్నారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ..
- 200 రోజులు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు



అగ్రహారంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని, ఇతర రాష్ట్రాల నేతలు మన పథకాలను ఆదర్శంగా కుంటున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం 1వ వార్డు సచివాలయం 30వ వార్డు అగ్రహారంలో గురువారం ఆయన 200వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి 200 రోజులు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు నిర్విరామంగా ప్రజల్లో తిరుగుతూ 200 రోజులు గ్రామాలు, వార్డుల్లో పర్యటించి గడపగడపకూ మన ప్రభుత్వ కార్యాక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆయనను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 85 సచివాలయాలు ఉండగా ఇప్పటివరకు 64 సచివాలయాలను సందర్శించామన్నారు. 200 రోజుల్లో 72,961 కుటుంబాలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించామన్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కల్పన, పథకాల పంపిణీకి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన ప్రజల ముంగిటకు చేరిందన్నారు. గతంలో ఏచిన్న పని కావాలన్నా సుదూర ప్రాంతాల్లోని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను రైతుల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు వబ్రవు భువనేశ్వరి, వబ్రవు వీరేష్, వబ్రవు శైలజ, వబ్రవు రాజశేఖర్, గండేపల్లి బాబీ, పచ్చిమళ్ల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్దినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

సుందరెడ్డికి దవులూరి పరామర్శ

పెద్దాపురం: పితృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని పులిమేరు గృహ సారథుల కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకులు సుందరెడ్డి రాజు కుటుంబాన్ని గురువారం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించారు. ఇటీవల రాజు తండ్రి కాసులు అకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతికి దవులూరి సంతాపం తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, నాగోబోయిన రాజుబాబు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డును అండర్‌పాస్‌కు అనుసంధానం చేయాలి

తుని: పట్టణంలోని రెండో వార్డులో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును రైల్వే అండర్‌పాస్‌కు అనుసంధానం చేయాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన రైల్వే డీఈ, మున్సిపల్ డీఈలతో చర్చించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొండవారిపేట రైల్వే తూము అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రెండో వార్డు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించి మంత్రి దాడిశెట్టి రాజా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.

చెరువు ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



సూరయ్య చెరువు భూమిలో వేసిన సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఇంపాక్ట్

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని సూరయ్య చెరువు భూమి ఆక్రమణను గురువారం అధికారులు అడ్డుకున్నారు. సర్వే నంబర్ 120లోని సుమారు నాలుగు ఎకరాల చెరువు భూమిలో కొందరు తుప్పలు తొలగించి సరిహద్దు రాళ్లు వేశారు. దీనిపై 'సూరయ్య చెరువు ఆక్రమణకు యత్నం' అనే శీర్షికతో ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తహసీల్దార్ వీవీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఇన్‌చార్జ్ జేఈ పి.వీరబాబు, లస్కర్స్ సీహెచ్ శేఖర్, నాగేంద్ర, సురేష్, వీఆర్వో దిలీప్, పంచాయతీ కార్యదర్శి తరంగిణి, తదితరులు గురువారం ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. భూమిలో వేసిన సరిహద్దు రాళ్లను తొలగించి వాటిని బయటకు తరలించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునే ప్రయత్నం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

డ్రైన్ల సమస్యకు చెక్

- రూ.8 లక్షలతో పనులకు హౌసింగ్ చైర్మన్ దవులూరి శంకుస్థాపన



వీకే రాయపురంలో డ్రైను పనులకు శంకుస్థాపన చేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: మండలంలోని వీకే రాయపురంలో డ్రైన్లు సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామానికి మంజూరైన నిధులతో డ్రైన్ల నిర్మాణానికి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గురువారం శంకుస్థాపన చేశారు. జెడ్పీ నిధులు రూ.8 లక్షలతో గ్రామ శివారు ప్రాంతాలలైన సత్యవరపుపేట, కొత్తూరులో ఈ పనులు చేయనున్నారు. కొత్తూరు కాలనీ ప్రజల కోసం గోదావరి కాలువ వద్ద రూ.3.5 లక్షల మండల పరిషత్తు నిధులతో నిర్మాణం చేసిన స్నానాల రేవును దొరబాబు ప్రారంభించారు. ఈ పనులకు పీఆర్ డీఈ హాజరు కాకపోవడంతో ఆయనకు మెమో ఇవ్వాలని ఎంపీడీఓ డి.శ్రీలలితకు ఎంపీపీ సూచించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ మోర పూర్ణిమ, ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- చేబ్రోలులో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం



చేబ్రోలులో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ఆయిల్ పామ్ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గురువారం కఠారి యాదవకృష్ణ పొలంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందన్నారు. రైతులందరూ ఆయిల్ పామ్ సాగు చేసి మంచి దిగుబడులు, లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. పతంజలి ఫుడ్స్ అధికారి డి.రవీంద్ర మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 40 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తుండగా 50 వేల టన్నుల దిగుబడులు సాధిస్తున్నారన్నారు. మిగిలిన జిల్లాల కంటే ఇక్కడ ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, డీఎంఐఓ వరప్రసాద్, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేఈ చిన్నయ్యపాలెంలో కేంద్ర బృందం పర్యటన



కేఈ చిన్నయ్యపాలెంలో పారిశుధ్యంపై మహిళను ఆరా తీస్తున్న కేంద్ర బృందం

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కేంద్ర బృందం పర్యటించింది. బృంద సభ్యులు ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణలో పంచాయతీ అధికారుల తీరు, వ్యక్తిగత ఆరోగ్యం పరంగా తీసుకునే జాగ్రత్తలు తదితర వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి గ్రీన్ అంబాసిడార్లతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉపాధి పనులు

- 11 జిల్లాల డ్వామా అధికారులకు శిక్షణ
- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్



డ్వామా అధికారులకు శిక్షణను ప్రారంభించిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: ఉపాధి పథకంలో పనులు మరింత నాణ్యతతో చేయడానికి డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతీ గ్రామంలోను మొక్కలు నాటడంపై దృష్టి సారించాలన్నా రు. ఈ మొక్కలలో 60 శాతం మునగ మొక్కలు ఉండేలా చూడాలన్నారు. మొబైల్ యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరిగేలా శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ ఈటీసీ ఫ్యాకల్టీలు పి. శ్రీనివాసరావు, ఎంఎస్‌ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, నిహారిక, ఎస్‌కె మొహిద్దీన్‌లు మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

మెరైన్ సీఐగా రామ్మోహన్‌రెడ్డి

కాకినాడ క్రైం: కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐగా టి.రామ్మోహన్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ పోర్టు సీఐగా పనిచేస్తూ రామ్మోహన్ రెడ్డి మెరైన్ సీఐగా బదిలీ కాగా, ఆ స్థానంలో పనిచేస్తున్న సుమంత్ కాకినాడ పోర్టు సీఐగా కొద్ది రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఏపీ హౌసింగ్ చైర్మన్ దవులూరి



సామూహిక సీమంతాల్లో పాల్గొన్న దొరబాబు



కొత్తపల్లిలో లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న నాయకులు

పెద్దాపురం: పోషకాహారం ద్వారా మహిళలు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక వెలమ కళ్యాణ మండపంలో గురువారం ఈ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష అధ్యక్షతన జరిగిన పోషకాహాకాహార కిట్ల పంపిణీలో దొరబాబు మాట్లాడుతూ ఆరోగ్యమైన భావితరాల కోసం ఖర్చుకు వెనుకాడకుండా పౌష్టికాహారం అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీరాజేశ్వరి, మున్సిపల్ చైర్ పర్సన్‌లు బొడ్డు తులసీ మంగతాయారు, గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఊబా జాన్ మోజెస్, జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

కొత్తపల్లి: ఆరోగ్యవంతమైన భావి తరాల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ ప్లస్ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీడీఓ అబ్రహం లింకన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఏ రాష్ట్రంలోను లేని విధంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు.వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ఒక్కొక్కరికీ నెలకు రూ.850 చొప్పున ఖర్చు చేస్తుండగా సంపూర్ణ పోషణ్ ప్లస్ కింద రూ.1150 ఖర్చు చేస్తోందని వివరించారు. పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ, విశాఖలకు వెళ్లి పింఛన్ల అందజేత



కాకినాడలో భాస్కరరావుకు పింఛను అందజేసిన నాగలక్ష్మి



విశాఖలో ఐసీయూలో పింఛన్ అందజేస్తున్న కొండపల్లి వలంటీర్ అప్పలకొండ

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీ గడువు ముగియడంతో ప్రతి లబ్ధిదారుకు పింఛను అందేలా వలంటీర్లు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా 7వ సచివాలయం పరిధిలోని కాదులూరి భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడ బంధువుల ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగలక్ష్మి గురువారం సాయంత్రం కాకినాడ వెళ్లి లబ్ధిదారుకు పింఛను అందజేశారు.

పెద్దాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకలో వలంటీర్లు అందిస్తున్న సేవలు వర్ణనాతీతం. పెద్దాపురం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ తమ పరిధిలో వికలాంగ పింఛన్ లబ్ధిదారుడు దుంగల ఆంజనేయులు విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో నేరుగా తన సొంత ఖర్చులతో విశాఖ చేరుకుని పింఛన్ అందజేశారు. పెద్దాపురం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ అప్పలకొండ విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆంజనేయులుకి ఐసీయూకి వెళ్లి పింఛన్ అందజేసి అందరి మన్ననలు పొందారు.